సాక్షి
అనంతపురం
శుక్రవారం ౹ 8 ౹ డిసెంబర్ ౹ 2023



అన్నింటా ముస్లింలకు ప్రాధాన్యత

సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్నింటా ముస్లింలకు ప్రాధాన్యత కల్పించారని మాజీ ఎమ్మెల్యే విశ్వ అన్నారు. 8లో



కిలో టమాట రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.8, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.5°/19.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా దరఖాస్తుల పరిశీలన

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అందిన క్లెయిముల దరఖాస్తులు, అభ్యంతరాలను పకడ్బందీగా పరిశీలిస్తున్నామని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఎలక్టోరోల్స్‌లో వ్యత్యాసాలు, జంక్ క్యారెక్టర్లు, ఓట్ల తొలగింపు, దిద్దుబాటు తదితర అంశాలపై అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరిచంద్రప్రసాద్ గురువారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ పాల్గొన్నారు. జంక్ క్యారెక్టర్లకు సంబంధించి 507 దరఖాస్తులు, ఇంటి నంబరులో 10 కంటే ఎక్కువ ఓటర్లకు సంబంధించి 2,764 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని సూక్ష్మ పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తుల విషయంలో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సమావేశంలో డీఆర్ఓ గాయత్రిదేవి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, పరిపాలనాధికారి శ్రీధర్, తహసీల్దారు మునివేలు, ఎన్నికల సెల్ డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్లూరులో 'జగనన్నకు చెబుదాం'



కార్యక్రమ ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ మోహన్‌కుమార్

పుట్లూరు: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో శుక్రవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ గౌతమి, ఇతర జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలు తెలియజేసి, పరిష్కారం పొందవచ్చని సూచించారు.

నేడు 'వికసిత్ భారత్'పై సమీక్ష

అనంతపురం అర్బన్: 'వికసిత్ భారత్' సంకల్ప యాత్రపై కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి సచ్చింద్రకుమార్ పట్నాయక్ శుక్రవారం సమీక్ష నిర్వహిస్తారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో హాజరుకావాలని ఆయన ఆదేశించారు. సమీక్ష అనంతరం రాప్తాడు మండలం బండమీదపల్లిలో నిర్వహించనున్న 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో సచ్చింద్ర కుమార్ పాల్గొంటారని తెలిపారు.



ప్రసంగిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, చిత్రంలో ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



బస్సుయాత్రకు తరలివచ్చిన అశేష జన వాహినిలో ఓ భాగం

మడకశిరలో జన సునామీ

మడకశిర జన సంద్రంగా మారింది. ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. జై జగన్... జయహో జగన్ నినాదాలు హోరెత్తాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు తరలిరావడంతో 'సామాజిక సాధికార బస్సు యాత్ర ' విజయవంతమైంది. నాయకుల ప్రసంగాలు వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపాయి.

- మడకశిరలో సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం
- భారీగా తరలివచ్చిన ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం
- గతానికి నేటికీ ఎంతో మార్పువచ్చిందన్న ప్రజాప్రతినిధులు



జనసందోహం నడుమ సాగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్ర

మడకశిర: పట్టణంలో గురువారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర అట్టహాసంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ప్రధాన వీధులన్నీ సందడిగా మారాయి.

బడుగు, బలహీన వర్గాలు తలెత్తుకునేలా..

బడుగు, బలహీన వర్గాలు తలెత్తుకుని తిరిగేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలన చేస్తోందని శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మనూరు జయరాం, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ అన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో సమన్యాయం పాటిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్‌లో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్ర సభలో వారు మాట్లాడారు.

హిందూపురం రోడ్డు నుంచి...

హిందూపురం రోడ్డులోని శ్రీసరస్వతి విద్యా మందిరం నుంచి గురువారం మధ్యాహ్నం సాధికర బస్సు యాత్ర ప్రారంభమైంది. దారి పొడవునా వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, జెండాలు, పూల వర్షంతో ప్రజాప్రతినిధులు, నాయకులకు ఘన స్వాగతం లభించింది. బస్సుపై నుంచి నాయకులు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద సాధికార బస్సుయాత్రను ముగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రసంగించారు. మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు ఎంపీలు నందిగం సురేశ్, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, డాక్టర్ తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీశ్‌కుమార్ యాదవ్, వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక, మడకశిర నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ పాల్గొన్నారు.





అభిమానుల కేరింత

బాబు గొప్పలు మాటలకే పరిమితం



'ఐటీ కంపెనీలు తెచ్చాను. హైటెక్ సిటీ కట్టాను. సత్యనాదెళ్లను నేనే తయారు చేశాను. సుందర్ పిచాయ్‌ను తెచ్చింది నేనే' అని చంద్రబాబునాయుడు గొప్పలు మాటలకే పరిమితం అయ్యాయి. మూడుసార్లు సీఎం అయినప్పటికీ.. ప్రజలకు ఆయన చేసిందేమీ లేదు. వనజాక్షి వంటి మహిళా అధికారులను అగౌరవపరిచిన టీడీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళలు గౌరవంగా బతకాలంటే సీఎంగా జగనన్న ఉండాలి.

– గోరంట్ల మాధవ్, హిందూపురం ఎంపీ

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి



వచ్చే ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుంది. జగనన్నే మరోసారి సీఎం కావడం తథ్యం. మడకశిర నియోజకవర్గానికి వైఎస్ కుటుంబం చేసిన సేవలు మరువలేనిది. హంద్రీనీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ నిర్మాణానికి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారు. జగనన్న వచ్చాక ప్రతి ఏటా మడకశిరకు కృష్ణా జలాలు అందించారు. జగనన్న మీద ఉన్న అభిమానంతోనే నేడు మడకశిర జనసంద్రంగా మారింది.

– తిప్పేస్వామి, మడకశిర ఎమ్మెల్యే

మహిళలకు తగిన గౌరవం దక్కింది



జగనన్నతోనే సాధికారత సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు తగిన గౌరవం దక్కింది. గతంలో ప్రభుత్వ ఫలాలు అందాలంటే జన్మభూమి కమిటీల ఆమోదం కావాల్సి వచ్చేది. నేడు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అవుతోంది. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

క్లుప్తంగా

సిబ్బంది సంక్షేమానికి సమష్టి కృషి


మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: పోలీసు సిబ్బంది సంక్షేమానికి సమష్టిగా కృషి చేద్దామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో పోలీసు అధికారులు, పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులతో వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యుల సంక్షేమానికి అమలు చేస్తున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ రమేష్ నాయక్, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 3 లక్షల చెక్కుల అందజేత

ఏఆర్ ఎస్ఐ షంషీర్ వలీ, సివిల్ కానిస్టేబుల్ ఉమేష్, ఏఆర్ కానిస్టేబుల్ కిరణ్ కుమార్‌లు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి కుటుంబాలకు అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ. 3 లక్షల విలువ చేసే చెక్కులను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అందజేశారు. కార్యక్రమంలో షంషీర్ వలీ భార్య మస్తాన్‌బీ, ఉమేష్ భార్య వనిత, కిరణ్ కుమార్ భార్య అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆరు దుకాణాల్లో చోరీ

గుత్తి: స్థానిక గుంతకల్లు రోడ్డులోని ఆరు దుకాణాల్లో దుండగులు చొరబడి నగదు, విలువైన సామగ్రిని అపహరించుకెళ్లారు. వివరాలు.. గుంతకల్లు రోడ్డులోని మధుసూదన్, నందగోపాల్, బాషా కిరాణా దుకాణాలతో పాటు హర్షవర్ధన్ హెల్త్ క్లినిక్, దాదా మెడికల్ స్టోర్, బ్రహ్మణి డయాగ్నొస్టిక్ సెంటర్, శ్రీరామ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోరీ జరిగింది. మొత్తం రూ.13 వేలు నగదుతో పాటు విలువైన వస్తువులు అపహరించుకెళ్లారు. మరో మూడు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి ఆధారాలు సేకరించారు. ఘటనపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

బస్సు, ఐచర్ ఢీ

- ఏడుగురికి స్వల్ప గాయాలు

గార్లదిన్నె: ఆర్టీసీ బస్సు, ఐచర్ వాహనం ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. వివరాలు... గుంతకల్లు నుంచి గురువారం రాత్రి అదే డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 62 మంది ప్రయాణికులతో అనంతపురానికి బయలుదేరింది. గార్లదిన్నె విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు చేరుకోగానే వైజంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకునే క్రమంలో అనంతపురం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఐచర్ వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో బస్సులోని ప్రయాణికులు కడ్డీలను, ఎదురుగా ఉన్న సీట్లను బలంగా ఢీకొనడంతో నలుగురికి రక్తగాయాలు, మరో ముగ్గురికి మూగదెబ్బలు తగిలాయి. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా స్థానిక పీహెచ్‌సీకి తరలించి, చికిత్స అందజేశారు. అనంతరం ప్రయాణికులను మరో బస్సులు గమ్యస్థానానికి చేర్చారు. ఘటనపై గార్లదిన్నె పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అన్నింటా ముస్లింలకు ప్రాధాన్యత

- మదరసా ప్రతినిధుల ఆత్మీయ కృతజ్ఞత సభలో మాజీ ఎమ్మెల్యే విశ్వ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ (చిత్రంలో) నదీం, రిజ్వాన్, సైపుల్లాబేగ్, మేయర్ వసీం

ఉరవకొండ: సీఎం వైఎస్ జగన్ పాలనలో అన్నింటా ముస్లింలకు ప్రాధాన్యత పెరిగిందని వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక బళ్లారి జాతీయ రహదారిపై ఉన్న ఆల్‌జమాతుల్ ఇస్లామియా, నూరుల్ హుదా దారుల్ ఉలూమ్ రజాయే గౌస్ ఆజాం మదరసాలలో 20 ఏళ్లుగా గురుకుల విద్యను అభ్యసిస్తున్న వందలాది మంది విద్యార్థులు, మదరసా నిర్వాహకులు తాగునీటి కోసం అవస్థలు పడేవారు. విషయం తెలుసుకున్న విశ్వేశ్వరరెడ్డి స్పందిస్తూ సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. రూ.లక్షల వ్యయంతో ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేయించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉరవకొండలో మదరసా ప్రతినిధుల ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.ఎ.జిలాన్ అధ్యక్షతన బైపాస్ చెక్‌పోస్టు వద్ద ఉన్న మదరసాలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వ మాట్లాడుతూ.. ఉరవకొండలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.2.68 కోట్లతో జేజేఎం పనులు ప్రారంభించామన్నారు. రూ.30 లక్షల వ్యయంతో 90 కేఎల్ ఓహెచ్‌ఎస్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ నిధులతో 150 ఫిస్టన్ ట్యాంకులు, రూ.20 లక్షల మండల పరిషత్ నిధులతో పైప్‌లైన్ పనులు కూడా ప్రారంభించామన్నారు. అదే సమయంలో మదరసాలో నెలకొన్న తాగునీటి సమస్య తన దృష్టికి వచ్చిందని, ఈ సమస్యను పరిష్కరించడాన్ని బాధ్యతగా స్వీకరించి పనులు పూర్తి చేయించినట్లు గుర్తు చేశారు. ఇప్పటికే ఉరవకొండ ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయించామని, అలాగే ముస్లిం షాదీఖానాను పూర్తి చేయడానికి మరో రూ.50 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించినట్లుగా తెలిపారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, అనంతపురం నగర మేయర్ వసీం మాట్లాడుతూ.. వైఎస్ కుటుంబ పాలనలోనే ముస్లింలకు అన్నింటా ప్రాధాన్యత దక్కిందన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్‌తో నాడు ముస్లింల జీవితాల్లో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వెలుగు నింపారని గుర్తు చేశారు. అదే బాటలో సీఎం వైఎస్ జగన్ నడుస్తూ అన్నింటా ముస్లింలకు ప్రాధాన్యతనిస్తూ అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసిన చంద్రబాబు అప్పట్లో మైనార్టీల అభ్యున్నతికి కేవలం రూ.500 కోట్లు ఖర్చు పెడితే, ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం రూ.2 వేల కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి మైనార్టీలు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, కోఆప్షన్ సభ్యుడు పామిడి నలీం, వడ్ల సలీం, బళ్లారి ఆసీఫ్, దర్గాకమిటీ అధ్యక్షుడు హోతూరుబాషా, అయ్యర్ దాదు, అన్వర్, బెళగల్ షమ్ము, పామిడి నూర్, గోల్డ్ జాఫర్, తన్వీర్, తాజు, ఫొటో ఖాదర్, పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ అద్భుతం


మాట్లాడుతున్న పీఆర్, ఆర్‌డీ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి

అనంతపురం సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయ వ్యవస్థ దేశంలోనే అద్భుతమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి కొనియాడారు. అనంతపురంలోని జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న డీపీఆర్‌సీలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ రాకతో అభివృద్ధి వేగవంతం కావడమే గాక అర్హులందరికీ సంక్షేమ ఫలాలు విజయవంతంగా అందుతున్నాయన్నారు. కరోనా సమయంలోనూ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అందించిన సేవలు అమోఘమని ప్రశంసించారు. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని జెడ్పీ, డీఎల్‌డీఓలు, డీపీఓలు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు హాజరయ్యారు.

సైనిక్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా సైనిక్ స్కూళ్లలో 6,9 తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు తెలిపారు. 2024 జనవరి 21 రాత పరీక్ష ఉంటుందన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతిలో ప్రవేశానికి 2024 మార్చి 31 నాటికి 10-12 సంవత్సరాల మధ్య ఉండాలని, 9వ తరగతిలో ప్రవేశానికి 13-15 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ఈనెల 16లోగా ప్రవేశ పరీక్ష ఫీజు చెల్లించాలని వెల్లడించారు. జనరల్ కేటగిరి విద్యార్థులు రూ. 650, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 500 చొప్పున ఆన్‌లైన్‌లో గేట్‌వే ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.nta.ac.in,https://exams.nta.ac.in/AISSEE/.వెబ్‌సైట్లు, +911140759000 హెల్ప్‌లైన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డికి సతీవియోగం


ఉమాదేవి (ఫైల్)

- హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉమాదేవి మృతి
- నేడు కొనకొండ్లలో అంత్యక్రియలు


ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: ఎమ్మెల్సీ, ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి (55) గురువారం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక గురువారం ఉదయం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని రాత్రి కొనకొండ్లకు తీసుకొచ్చారు. గ్రామస్తులతో పాటు ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు.

కొనకొండ్లలో విషాదఛాయలు..

ఉమాదేవి మరణంతో కొనకొండ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కుమారుడు వై.భీమిరెడ్డి, కుమార్తె వై.కీర్తిరెడ్డి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం ఎమ్మెల్యేలు వై.వెంకట్రామిరెడ్డి, వై.సాయిప్రసాద్‌రెడ్డి, వై.బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు వై.సీతారామిరెడ్డి, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. శివరామిరెడ్డికి మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ ఫోన్ చేసి సానుభూతి తెలిపారు. గురువారం రాత్రి కొనకొండ్లకు మంత్రి గుమ్మనూరు జయరాం, ఏపీసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పయ్యావుల కేశవ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చేరుకుని శివరామిరెడ్డిని కలసి సానుభూతి తెలిపారు.

నేడు అంత్యక్రియలు

శుక్రవారం మధ్యాహ్నం ఉమాదేవి భౌతికదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కుటుంబసభ్యులు తెలిపారు.

ఆత్మకు శాంతి చేకూరాలి..

ఉరవకొండ: ఉమాదేవి ఆత్మకు శాంతి చేకూర్చాలని వైఎస్సార్‌సీపీ నేతలు దేవుడిని ప్రార్థించారు. గురువారం ఉరవకొండలో జరిగిన మైనార్టీల కృతజ్ఞత సభలో ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీంఅహ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రిజ్వాన్, అనంతపురం మేయర్ మహ్మద్ వసీం, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైపుల్లా బేగ్ తదితరులు రెండు నిముషాలు మౌనం పాటించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కీచకోపాధ్యాయుడి బదిలీ

గుంతకల్లు టౌన్: స్థానిక ఝాన్సీ లక్ష్మీబాయి (జేఎల్‌బీ) మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు కుళ్లాయప్పను డిప్యుటేషన్‌పై పాత గుంతకల్లులోని ఆర్‌జీ మున్సిపల్ స్కూల్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు స్థానిక జేఎల్‌బీ స్కూల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంఈఓ మస్తాన్‌రావు వెల్లడించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అభద్రతాభావాన్ని తొలగించేందుకు ఆయన స్థానంలో విశాలాక్షి అనే మహిళా టీచర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. కాగా, అదే స్కూల్ ఆవరణలోని మరో స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రామాంజినాయక్‌ను సైతం సాయినగర్‌లోని డిపెప్ స్కూల్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేసినట్లు వివరించారు. జేఎల్‌బీ స్కూల్ ఘటనపై నివేదిక సిద్ధం చేసి డీఈఓకు అందజేశామని, తదుపరి ఆదేశాల మేరకు కుళ్లాయప్ప చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


జెండా ఊపి ఆటోలను ప్రారంభిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం: మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో 'ఉన్నతి-మహిళా శక్తి' పథకాన్ని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. మహిళా లబ్ధిదారులకు ఆటోలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ నిరుపేద మహిళలకు ఆటోలను వడ్డీలేని రుణాలతో అందిస్తున్నామన్నారు. ఆటోకి బీమా చేయించాలన్నారు. నిర్ణీత వాయిదాల్లో అప్పు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసింహా రెడ్డి, యాంకర్ పర్సన్ మంజుల, ఏపీడీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



నా భర్త అద్దె ఆటో నడుపుతుండేవారు. నేను అనంతపురం ఓల్డ్‌టౌన్‌లో కిరాణా షాపులో రోజువారీ కూలీ పనిచేసేదాన్ని. వచ్చే డబ్బు సరిపోయేది కాదు. పిల్లల్ని విద్యావంతులను చేయాలనే ఉద్దేశంతో సొంతంగా ఆటో పెట్టుకోవాలని నిర్ణయించుకున్నా. గోదావరి మహిళా సంఘంలో సభ్యురాలిని కావడంతో రూ.3 లక్షల వడ్డీలేని రుణంతో ఆటోను ప్రభుత్వం అందజేసింది. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– పల్లవి, తోపుదుర్తి, ఆత్మకూరు మండలం

మరికొంతమందికి ఉపాధి చూపిస్తా



ఇంద్రమ్మ సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. రోజూ పొలాల్లో కూలీ పనులకు వెళ్లేదాన్ని. 'ఉన్నతి- మహిళా శక్తి' పథకం కింద పేరు నమోదు చేసుకున్న కొన్ని రోజుల్లోనే ఆటో అందజేశారు. మా గ్రామంలో పొలం పనులకు వెళ్లేవారు చాలా మంది ఉన్నారు. వారిని తీసుకెళ్లి, తీసుకురావడం ద్వారా మంచి ఆదాయం వస్తుందని భావిస్తున్నా. గ్రామంలో మరింత మంది మహిళలకు ఉపాధి కలిగేలా చూస్తా.

– కావేరి, వెంకటాపురం గ్రామం, బుక్కరాయసముద్రం మండలం

డ్రోన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

- జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ


డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీని ప్రారంభిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

శింగనమల: డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేయడం చాలా సులువని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం శింగనమలలో డ్రోన్ ద్వారా పురుగుల మందుల పిచికారీని ఆమె ప్రారంభించి, మాట్లాడారు. పురుగు మందుల పిచికారీకి డ్రోన్‌ను ఉపయోగించడం ద్వారా సమయం ఆదాతో పాటు ఖర్చు కూడా తక్కువగా ఉంటుందన్నారు. మట్టి నమూనా పరీక్షల ఫలితాల పత్రాలు, సేంద్రియ ఎరువుల తయారీ, నానో యూరియా, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ అన్వేష్‌కుమార్, రైతులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి వంటగ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరమ్మ, గ్రామ సర్పంచ్ నాగమునెమ్మ, ఎంఈఓ-2 శివప్రసాద్, కెనరా బ్యాంక్ మేనేజర్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంగారం అపహరణ


ఇంటిని పరిశీలిస్తున్న సీఐ హమీద్‌ఖాన్

తాడిపత్రి: స్థానిక విజయనగర్ కాలనీలో నివాసముంటున్న శ్రీరంగయ్య ఇంట్లో చోరీ జరిగింది. తన కుటుంబ సభ్యులతో కలసి బెంగుళూరులో ఉన్న కుమారుల వద్దకు 10 రోజుల క్రితం శ్రీరంగయ్య వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు బుధవారం అర్ధరాత్రి తర్వాత లోపలకు చొరబడ్డారు. గురువారం తెల్లవారుజామున ఇంటిని శుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి.. తలుపులు తీసి ఉండడాన్ని గమనించి సమాచారం అందించడంతో శ్రీరంగయ్య ఆగమేఘాలపై తాడిపత్రికి చేరుకున్నారు. బీరువాలో ఉంచిన 5 తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్య


రామయ్య (ఫైల్)

పెద్దపప్పూరు: మండల కేంద్రంలోని రామకోటి కాలనీ చెందిన మంగలి రామయ్య (38) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొన్ని నెలలుగా కడుపు నొప్పితో రామయ్య పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఏఎస్ఐ మహదేవ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి మూడేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు.

సాయుధ దళాల సేవలు అమూల్యం


జేసీ కేతన్‌గార్గ్ చేతుల మీదుగా సైనిక సంక్షేమానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: దేశ రక్షణలో సాయుధ దళాల సేవలు అమూల్యమని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని సైనిక కుటుంబాల సంక్షేమ నిధికి గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, పలువురు విరాళం అందజేశారు. జాయింట్ కలెక్టర్ రూ.11 వేలు, దండు శ్రీనివాసులు రూ.20 వేలు, డాక్టర్ హిమబిందు రూ.5 వేలు, రఘునాథరెడ్డి రూ.5 వేలు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సైనికుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధికి విరాళాలు అందిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి జె.శ్రీనివాసులు, సిబ్బంది, సైనిక బోర్డు సభ్యులు బలరామ్‌రావు, మాజీ సైనికులు సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, సురేంద్ర, శ్రీనివాసులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

వైరల్ వీడియోపై స్పందించిన ఎస్పీ

అనంతపురం క్రైం: తాడిపత్రి సీఐ హమీద్‌ఖాన్‌పై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై ఎస్పీ అన్బురాజన్ స్పందించారు. సమగ్ర విచారణకు అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్‌ను నియమించారు. సీఐ హమీద్‌ఖాన్ తప్పు చేసి ఉంటే అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొత్త ఏడాదిలో కార్మిక సెలవులు

అనంతపురం సిటీ: రాబోవు నూతన సంవత్సరానికి సంబంధించి కార్మిక శాఖ సెలవులను ప్రకటించింది. ఈ మేరకు కార్మిక శాఖ జోన్-4 కమిషనర్ బాబు నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్మిక శాఖకు అనుబంధంగా ఉన్న అన్ని రకాల విభాగాలకు చెందిన కార్మికులకు ఈ సెలవు దినాలు వర్తిస్తాయన్నారు. ముఖ్యంగా పరిశ్రమలకు ఎనిమిది సెలవు దినాలుగా ప్రకటించగా... దుకాణాలు, సంస్థలకు తొమ్మిది రోజుల సెలవులు ఇచ్చారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి

కళ్యాణదుర్గం: మెళకువలు పాటిస్తే మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో గురువారం మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎరువులు, నీటి వాడకం, తేనెమంచు పురుగు, బూడిద తెగులు, చెదల నివారణకు సంబంధించిన విషయాలను రైతులకు తెలియజేశారు. నాణ్యమైన మామిడి దిగుబడికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో మండల హార్టికల్చర్ అధికారిణి గౌసియా, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రతినిధి అల్లెన్‌మాథ్యూ, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మిరెడ్డి, సెక్టార్ టీం లీడర్ రామకృష్ణ, ఎస్‌ఎంఎస్ నాగరూప, ఆర్డీటీ సిబ్బంది, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకుల అరెస్ట్

అనంతపురం క్రైం: మహిళలను కించపరుస్తూ సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, బాలయ్య, రవి ఈ నెల 5న నార్పల మండలం మద్దలపల్లి జాతరకు వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తూ మహిళల పట్ల అనుచితంగా మాట్లాడుతూ సోషల్‌మీడియాలో వీడియోను వైరల్ చేశారు. దీనిపై స్పందించిన ఎస్పీ సదరు యువకులను అరెస్ట్ చేయించి, రిమాండ్‌కు పంపారు.

భూసార పరీక్షలతో పెట్టుబడి ఆదా

పుట్లూరు: భూసార పరీక్షలు చేయించుకుని అవసరమైన ఎరువులను వాడటం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మద్దిలేటి అన్నారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు భూసార పరీక్షల ఆధారంగా మందులు వాడకం, నానో యూరియా ఉపయోగాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శైలజ, ఏఓ కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేద్దాం

కళ్యాణదుర్గం: త్వరలో జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయి నుంచే పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ కార్యకర్తలకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పిలుపునిచ్చారు.స్థానిక కరణం భవన్‌లో గురువారం జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు, మండల కమిటీలను త్వరతగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంకాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చిరంజీవిరెడ్డి, వసుంధరమ్మ, లలిత్‌కుమార్, రత్నమయ్య, స్థానిక నాయకులు బంగారు మల్లారెడ్డి, ముప్పూరి దేవరాజ్, చెక్కా సుబ్రహ్మణ్యం, గంగాధర్, తలారి సోము, ఆదినారాయణ, అంజనేయులు, నంజుండరావు, తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో మట్కా రాస్తూ పది మంది బీటర్లు పోలీసులకు పట్టుబడ్డారు. వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. అందిన ముందస్తు సమాచారంతో కళ్యాణదుర్గం శివారు ప్రాంతాల్లో గురువారం ఉదయం పోలీసులు తనిఖీలు చేపట్టారు. శ్రీనివాస కల్యాణ మంటపం ఎదురుగా బయలు ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించిన పది మందిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో మట్కా వ్యవహారం వెలుగు చూసింది. వారి నుంచి మట్కా పట్టీలు, రూ.48,230 నగదు, 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, మట్కా బీటర్ల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ నాగరాజు, ఎస్ఐలు యువరాజ్, సుధాకర్, సుధాకర్ యాదవ్, సిబ్బందిని ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

ధైర్యంగా ఉండండి



సోమిరెడ్డితో మాట్లాడుతున్న తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన పార్వతమ్మ (66) గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి గురువారం ఆత్మకూరుకు చేరుకొని పార్వతమ్మ భర్త సోమిరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శివశంకర్‌రెడ్డి, పెద్ద కొండారెడ్డి, మాజీ జెట్పీటీసీ బంధూక మధు, సోము, పరిగిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న స్త్రీల వైద్య నిపుణురాలు గీతా దేవినేని

రాప్తాడు: మహిళలు, విద్యార్థినులు వ్యక్తి గత పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని స్త్రీల వైద్య నిపుణులు గీతా దేవినేని అన్నారు. గురువారం మండలంలోని హంపాపురం సమీపంలోని శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఐటీ) ఇంజినీరింగ్ కళాశాలలో మహిళలు, విద్యార్థులకు ఆరోగ్యం - అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని, చదువులో ముందంజలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చవ్వా బిందు రెడ్డి, అక్షిత, కళాశాల ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌కు డాక్టరేట్ ప్రదానం



జి. రామ్మోహన్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన చేసిన జి.రామ్మోహన్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ జే శ్రీరాములు పర్యవేక్షణలో ' సింథసిస్ అండ్ స్పెక్ట్రోకెమికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ న్యూ షిఫ్ బేస్ మెటల్ కాంప్లెక్సెస్- డాకింగ్ స్టడీస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

సంజీవులు స్ఫూర్తితో పోరాటాలు



పూలకుంట సంజీవులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు కవి, గాయకుడు పూలకుంట సంజీవులు స్ఫూర్తితో ప్రజాసమస్యల సాధనకు పోరాటాలు సాగించాలని సీపీఐ నాయకులు అన్నారు. గురువారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి అధ్యక్షతన పూలకుంట సంజీవులు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంజీవులు చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున మాట్లాడారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం తొలి కార్యదర్శిగా సంజీవులు పనిచేశారన్నారు. కార్యక్రమంలో సంజీవులు కుమారులు జయంత్, అజయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు రామకృష్ణ, పెద్దయ్య, తిరుపాలు, నాగరాజు, నాగమణి పాల్గొన్నారు.

కనులపండువగా అయ్యప్ప గ్రామోత్సవం



చెరువుకట్ట అయ్యప్ప స్వామి గ్రామోత్సవ వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్ట అయ్యప్ప స్వామి దేవాలయ గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ఐదురోజుల పాటు సాగే స్వామివారి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయం నుండి పాతూరు మార్కెట్, తిలక్‌రోడ్డు, సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్, ఆర్ఎఫ్‌రోడ్డు మీదుగా ఆలయం చేరుకున్న గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మాలధారులు నగరవీధుల్లో ఆనంద తాండవం చేశారు. భక్తిగీతాలతో, అయ్యప్ప శరణు ఘోషతో పరిసరాలను మార్మోగించారు. శుక్రవారం అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వైకుంఠం.. డబుల్ గేమ్

- దొంగే దొంగ అన్నట్లుంది..టీడీపీ వైఖరి
- ప్రభాకర్‌చౌదరి సొంత డివిజన్‌లోనే డబుల్ ఓట్లు అధికం
- నగరంలోని చాలా ప్రాంతాల్లో రెండేసి ఓట్లు




మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసముండే రాంనగర్ ప్రాంతానికి చెందిన వీరికి, మరో ప్రాంతంలోనూ ఓట్లు ఉన్నట్లు చూపే ప్రతి



రాంనగర్‌లో ఒకే డోర్ నంబర్‌పై అధిక సంఖ్యలో ఓటర్లున్న జాబితా ఇదే



34వ డివిజన్‌కు చెందిన సుధాకర్, వరలక్ష్మిలకు రాప్తాడు గాండ్లపర్తి, అనంతపురంలో ఓట్లు ఉన్నట్లు చూపే జాబితా ఇది



మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న కుమారుడు సాకే రఘుకు గాండ్లపర్తి, నాయక్‌నగర్‌లో ఓటు ఉన్న జాబితా

అనంతపురం కార్పొరేషన్: పచ్చకామెర్లు ఉన్న వారికి లోకమంతా పచ్చగా కనిపిస్తున్నట్లుంది.. పచ్చ పార్టీ నాయకుల ప్రస్తుత పరిస్థితి..శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్నాయి..ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు ప్రజలను తప్పుదోవపట్టించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నగరంలో బోగస్ ఓట్ల పేరుతో అలజడి వాతావరణం సృష్టించేందుకు సిద్ధమయ్యారు. అధికారులకు ఫిర్యాదులు చేస్తూ, కుట్ర రాజకీయాలకు తెగబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ ఓటమి భయం పట్టుకుంది. ముఖ్యంగా ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేస్తోంది. దీంతో దొంగ ఓట్ల పేరుతో టీడీపీ కొత్త డ్రామాకు తెరలేపింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి తదితరులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మీడియా ద్వారా ముందుకువచ్చిన విషయం విదితమే.

మాజీ ఎమ్మెల్యే ఏరియాలోనూ 200లకు పైగా డబుల్ ఓట్లు:

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసం ఉండే రాంనగర్ (37వ డివిజన్)లో 99, 100, 101, 102, 103, 104 బూత్‌ల పరిధిలోని 200 మందికి చెందిన ఓట్లు జిల్లాలోని పెరవలి (శింగనమల) సూరేపల్లి, కనగానిపల్లి, కాట్నేకాలువ, కృష్ణంరెడ్డి పల్లి, కందుకూరు ప్రాంతాల్లోని ఓటరు జాబితాలో ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే నివాసానికి కూతవేటు దూరంలో ఉండే ఓ నివాసంలో (ప్రస్తుతం స్వీటు షాపు) 18 ఓటర్లను నమోదు చేశారు. 6-3-62 డోర్ నెంబర్ కింద పదుల సంఖ్యలో ఓట్లు నమోదు చేశారు. వీరంతా వివిధ ప్రాంతాల్లో ఓట్లు కలిగినవారే. 33వ డివిజన్‌లోనూ డిప్యూటీ మాజీ మేయర్ గంపన్న కుమారుడు సాకే రఘుకు రాప్తాడు మండలం గాండ్లపర్తితో పాటు నాయక్‌నగర్‌లోనూ అతని పేరు మీద ఓట్లు ఉన్నాయి. 34వ డివిజన్‌కు సంబంధించి బూత్ నంబర్ 153లో సీరియల్ నంబర్ 1223 సుధాకర్, 1224లో వరలక్ష్మి ఉన్నారు. వీరికి రాప్తాడు మండలం గాండ్లపర్తి బూత్ నంబర్ 155 సీరియల్ నంబర్ 422, 425లో ఓట్లు ఉన్నాయి. వరలక్ష్మి గత నగరపాలక సంస్థ ఎన్నికల్లో కార్పొరేటర్ స్థానానికి టీడీపీ తరపున పోటీ చేశారు.

మరికొన్ని డివిజన్లలోనూ అదే పరిస్థితి..

నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలోనూ టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున దొంగ ఓట్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న వారికి బుక్కరాయసముద్రం, శింగనమల, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో ఓట్లు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేస్తుండడంతో అటు అధికారులు..ఇటు ప్రజలు తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ నాయకులు చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నట్లు అధికార వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైనా టీడీపీ నాయకులు మీడియాను అడ్డం పెట్టుకొని కుట్రలు చేస్తున్నారు.



ఆకట్టుకున్న కళారూపాల ప్రదర్శన



నగరవీధుల్లో మహాలక్ష్మమ్మ అమ్మవారి ఊరేగింపులో కళా ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్: జిల్లా కేంద్రంలో కొలువైన ఏకైక మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం నగరవీధుల్లో శోభాయాత్ర నేత్రానందంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన పలు దేవతామూర్తుల వేషధారులు, ప్రాచీన కళారూపాలైన కోలాటం, చెక్కభజన, మరగాళ్లు, కోయదొరలు, గురవయ్యలు తమదైన ప్రతిభావిశేషాలతో పురాణ ఘట్టాలను గుర్తు చేస్తూ శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజన సందోహం అడుగడుగునా మంగళ హారతులు పట్టి అమ్మవారికి నీరాజనాల్పించారు.

జగనన్న నాయకత్వంలోనే దళితులకు పెద్దపీట

- ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ ఛైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల

అనంతపురం కార్పొరేషన్: జగనన్న నాయకత్వంలో దళితులకు పెద్దపీట వేశారని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. ఇటీవల మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో దళితులపై దమనకాండ సాగిందని, కానీ ఏనాడు చంద్రబాబు దళితుల పక్షాన నిలబడలేదన్నారు. బాబు హయాంలో పోలీసులు కేసు నమోదు చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద ఆంధ్రప్రదేశ్‌లో 14,43,619 మంది కుటుంబాలకు(99 శాతం) సహాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని 14,39,152 మంది ఎస్సీ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు అందిస్తే, అందులో 7,15,872 మంది ఏపీలో ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో కేవలం 4 కార్పొరేషన్ పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగనన్న 15 కార్పొరేషన్ పదవులతో పాటు శాసన మండలి చైర్మన్‌గా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

అవినీతి కాలవ:

గత టీడీపీ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డంపెట్టుకుని కాలవ శ్రీనివాసులు అవినీతి పారించారని మంజుల ఆరోపించారు. ఇసుక మాఫియాకు పాల్పడి రూ.కోట్లలో కొల్లగొట్టారని ఆర్జించారన్నారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ప్రభుత్వంపై బురదజల్లేలా చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకురాళ్లు శోభారాణి, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నాగదేవతల ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టల్లో పాల్గొని వేద ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

అనంతపురం కల్చరల్: శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన విగ్రహాలకు గురువారం నాగదేవతల విగ్రహాలకు శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్టలు జరిగాయి. నగరంలోని సోమనాథ్ నగర్ కోదండ రామాలయంలో రెండు రోజుల పాటు ఘనంగా సాగిన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. వేదపండితులు హరికృష్ణశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల కృష్ణమూర్తి, స్వామిమణూరు నాగరాజు ఆధ్వర్యంలో ఉదయం వేదమంత్రాల, మంగళవాయిద్యాల నడుమ నూతనంగా ఆలయంలో ఏర్పాటు చేసిన వేదస్తూపం, నాగ దేవతల విగ్రహాలు ప్రతిష్టలతో పూజలందుకున్నాయి. విరూపాక్ష దత్తపీఠం పీఠాధిపతులు విద్యానృసింహభారతి తారకరామ హోమం, గాయత్రి హోమం, నాగహోమాల్లో పాల్గొని ప్రతిష్టల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు నాగభూషణం, విజయసాయి, ప్రకాష రావు, ప్రసాద్, ఉమారాణి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ఆటోడ్రైవర్లతో అవగాహన



ఆటోడ్రైవర్లతో సమావేశమైన పోలీసులు

అనంతపురం క్రైం: జిల్లా ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. వారికి పోలీసులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, వాహనం నడిపే సమయంలో యూనిఫాం తప్పకుండా ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తీసికెళ్లరాదని, డ్రైవర్ సీట్ పక్కన ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి ఆటోలను నడిపితే చర్యలు తప్పవన్నారు. ఆటోలకు నంబర్లను తప్పని సరిగా తీసుకోవాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని హెచ్చరించారు.

మద్యం సేవించి ఆటోలు నడిపితే చర్యలు

ఆత్మకూరు: మద్యం సేవించి ఆటోలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ జనార్దన్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆటోలు నడిపే వారికి తప్పనిసరిగా లైసెన్సులు ఉండాలని, యూనిఫాం ధరించాలని తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆటోలో ప్రయాణించే ప్రయాణికులు మద్యం సేవించినట్లు తెలిసినా, అతి వేగంగా వాహనం నడిపినా డయల్ 100కు ఫోన్ చేయాలని తెలిపారు.

బాబుకే గ్యారెంటీ లేదు..ష్యూరిటీ ఎక్కడ?



అనంతపురం 59వ సచివాలయ పరిధిలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ నేతలు



తలుపూరులో మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: 14 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు ప్రజలను వంచించారని, గత ఎన్నికల్లో ప్రజలు టీడీపీని ఛీ కొట్టారని, రానున్న ఎన్నికల్లోనూ బాబుకు, ఆయన పార్టీకే గ్యారెంటీలేదు.. ఇక ఆయన ప్రజలకేమి ష్యూరిటీ ఇస్తారని మేయర్ వసీం పేర్కొన్నారు. గురువారం నగరంలోని 41వ డివిజన్ 59వ సచివాలయం జనశక్తినగర్, 33వ డివిజన్ నాయక్‌నగర్‌లోని 49వ సచివాలయం, 22వ డివిజన్ బుడ్డప్పనగర్‌లోని 35వ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. 59వ సచివాలయ పరిధిలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, కార్పొరేటర్ గోగుల లక్ష్మిదేవి సంక్షేమ, అభివృద్ధి బోర్డును ఆవిష్కరించి, వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేశారు. అదేవిధంగా 35, 49వ సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు లీలావతి, సాకే చంద్ర, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఓబిరెడ్డి, జగదీష్, మధు, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, లక్ష్మన్న తదితరులు సంక్షేమ, అభివృద్ధి, పార్టీ జెండా ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా నగరంలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి చేపట్టామన్నారు. ఒక్కో డివిజన్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా బళ్లారి, కళ్యాణదుర్గం బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు రూ.311.93 కోట్లతో ఫోర్ వే, బ్రిడ్జిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. కార్పొరేట్ వైద్యం అందించేందుకు సూపర్ స్పెషాలిటీలో స్పెషాలిటీ సేవలు, నగరంలోని 10 ప్రాంతాల్లో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసిందన్నారు.కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, డైరెక్టర్ ఖాజా, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, నాయకులు సుహాసిని, రాజు, విజయ్, లోకేష్ పాల్గొన్నారు.

అర్హత ఉంటే చాలు పథకాలు వర్తింపు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు వర్తించాయని ఎంపీపీ హేమలత తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ సానుభూతి పరుడైనా, జన్మభూమి కమిటీ సభ్యులు అయినా, టీడీపీ కండువా కప్పుకుంటేనో ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. గురువారం మండలంలోని తలుపూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజా ప్రతినిధులు కలసి సచివాలయం వద్ద సచివాలయ పరిధిలో ఎన్నికోట్లు అభివృద్ధి జరిగింది అన్న విషయాన్ని మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వం అందజేసిన పథకాల గురించి అభివృద్ధిపై ప్రజలకు తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, కన్వీనర్ లక్ష్మినరసింహులు,సర్పంచ్‌లు ఓబులేష్, లక్ష్మినారాయణ రెడ్డి, ఎంపీటీసీ ఓబులేసు, మాజీ సర్పంచ్‌లు ఓబిరెడ్డి, శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అతిక్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి,గోసుల,కొండా, శ్రీరామిరెడ్డి, ముత్యాలరెడ్డి, పరమేశ్వరరెడ్డి, భానుకిరణ్, తిమ్మరాజు , నాగరాజు, శివారెడ్డి, సదాశివారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

అనంతపురం అర్బన్: కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నాగవేణి మాట్లాడారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, మెడికల్ లీవ్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు రూ.5 లక్షలు ఉద్యోగ విరమణ బెనిఫిట్ వర్తింపజేయాలన్నారు. ఆశాలకు ఉచిత ప్రమాద బీమా రూ.10 లక్షలు వర్తించేలా బీమా కంతును ప్రభుత్వమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి రాజేశ్‌గౌడ్, ఆశా వర్కర్ల సంఘం నాయకులు ఫాతిమా, పార్వతి, హసీనా, అనంతలక్ష్మి, దుర్గమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన

అనంతపురం మెడికల్: నగరంలోని స్నేహలత ఆస్పత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆరోగ్యశ్రీ వర్తించే బాధితులతోనూ డబ్బులు వసూలు చేస్తున్నారని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవికి ఫిర్యాదు చేశారు. సీపీఐ నాయకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాండు రంగస్వామి నిజపాద దర్శనం

అనంతపురం కల్చరల్: కార్తీక మాసంలో వచ్చే ఉత్పత్తి ఏకాదశిని పురస్కరించుకొని భావసార క్షత్రియ సమాజం ఆధ్వర్యంలోరామనగర్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో నిజపాద స్పర్శ దర్శనం ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ మహేంద్రకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

43వ డివిజన్ అభివృద్ధికి చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 43 డివిజన్ అభివృద్ధి చర్యలు తీసుకుంటామని కమిషనర్ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఆ డివిజన్‌లో రూ.1.5 కోట్లతో 5, 6వ రోడ్డు అనుసంధానం బ్రిడ్జి, రూ.70 లక్షల ఏర్పాటు చేయబోవు కాలువలు, రూ.50 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, రూ.5 లక్షలతో ఆర్సీసీ బెంచులు, తదితర అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ అలీషేర్ ఇసాక్‌తో కలిసి కమిషనర్ భాగ్యలక్ష్మి గురువారం పరిశీలించారు. టెండర్ పూర్తయిన పనులు వేగవంతం చేసేలా తీసుకోవాలని, ప్రధానంగా నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూసుకోవాలని ఇంజినీర్లను కమిషనర్ ఆదేశించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఈఈ సూర్యనారాయణ, ఏఈ శంకర్, సచివాలయ కార్యదర్శులు, తదితరులున్నారు.

మాస్టర్ ప్లాన్‌లోని రోడ్డు తొలగించొద్దు

అనంతపురం కార్పొరేషన్: మాస్టర్ ప్లాన్‌లోని రోడ్డును తొలగించొద్దని సెవన్‌హిల్స్ కాలనీవాసులు శ్రీనివాస్, బాల, సురేష్‌లు నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మికి గురువారం విన్నవించారు. వారు మాట్లాడుతూ నగరంలోని 32వ డివిజన్ సర్వే నంబర్ 267, 268లో ప్రసన్నాయపల్లి రోడ్డును హౌసింగ్ బోర్డుకు కలుపుతూ 40 అడుగుల రోడ్డు (సెవెన్‌హిల్స్ కాలనీ) మాస్టర్ ప్లాన్‌లో ఉందన్నారు. కానీ ఈ రోడ్డును తొలగించినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. రోడ్డు లేకపోతే స్థానికంగా ఉండే వారికి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. మాస్టర్ ప్లాన్‌లో రోడ్డును తొలగించకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

IN THE COURT OF THE HON'BLE PRL. SENIOR CIVIL JUDGE : ANANTAPURAMU.

E.P. No. 55/2023 in O.S. No. 403/2017

Between :
H. Ravindra Reddy ...Petitioner/D.Hr.
V/s
G. Sreenivasulu ...Respondent/J.Dr.

NOTICE TO RESPONDENT / J.Dr.

G. Sreenivasulu S/o. G. Narappa, Krishna Tea Stall, D.No. 1-3-334, Ranga Swamy Nagar, Anantapuramu.

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై దావా నందు Decree పొంది వున్న D.Hr. తనకు రావలసిన మొత్తము కోర్టు ద్వారా రాబట్టు కొనుటకు కోర్టు నందు దావా వేసి వున్నారు. కోర్టు వారు J.Dr. ఆస్తిని విక్రయము అమలు పరచడానికి విక్రయ ప్రకటన యొక్క షరతులను నిర్ణయించుటకు గాను 21-12-2023వ తేదీ రోజు వాయిదా వేసి యున్నారు. కనుక పై తేదీ రోజు ఉదయం 10-30 గం॥ స్వతహాగాని వకీలు ద్వారా గానీ హాజరై ఏవైన అభ్యంతరాలు ఉన్న యెడల కోర్టు నందు తెలుపుకొనవలెను. లేని యెడల కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By order of the Court)

ఎ. రామిరెడ్డి, జి. రామ్ కిషోర్ రెడ్డి
అడ్వకేట్స్, అనంతపురము.

ఎల్లో మీడియా రాతల్లోనూ పచ్చపాతమే

- వైఎస్సార్‌సీపీ, ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు సహించేదిలేదు
- అనంతపురం వాసులకు గొరిదిండ్లలో భూములు ఎలా వస్తాయి?
- వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు

ఆత్మకూరు: ప్రభుత్వానికి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని అసత్యపు రాతలు రాయిస్తున్నారు.. అని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మండిపడ్డారు. గురువారం ఎమ్మెల్యే అనుచరులు దళితుల భూములు కబ్జా చేస్తున్నారు అంటూ ఎల్లో మీడియాలో అసత్యపు కథనాలు ప్రచురించారు. దీన్ని ఖండిస్తూ గురువారం ఆత్మకూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరులు భూమి కబ్జా చేస్తున్నరంటూ గొరిదిండ్లకు చెందని కేశవరెడ్డిపై ఆరోపణలు చేస్తూ ఎల్లో మీడియాలో రాశారన్నారు. ఆత్మకూరు మండలం గొరిదిండ్లకు సంబంధించిన సర్వేనంబర్ 274-5డిలో వైఎస్సార్‌సీపీ నాయకులు దళితుల భూమి కబ్జా చేశారు అని రాయడం సరికాదన్నారు. నిజానికి సర్వే నంబర్ 274-5డీలోని 10 ఎకరాల భూమిలో 1993లోనే గొరిదిండ్లకు చెందిన హనుమంతు అనే వ్యక్తికి పట్టా ఇచ్చారన్నారు. అనంతపురంలో నివాసం ఉండే పెద్దక్క అనే మహిళ పేరిట 2008లో అప్పటి మంత్రి శైలజానాథ్ పీఏ శంకర ద్వారా ఆ భూమిని చేయించారన్నారు. దొంగ పట్టాలను సృష్టించి తమపై బురద జల్లుతున్నారని గొరిదిండ్ల కేశవరెడ్డి మండిపడ్డారు. 274-5డిలోని పది ఎకరాల్లో గొరిదిండ్లకు చెందిన వారే హనుమంతుకు 2.50 ఎకరాలు, ఎట్టి రామాంజికి 1.50 ఎకరం , స్మశానానికి 3 ఎకరాలు పోగా 1.50 ఎకరాలు వంక ఉందని కేశవరెడ్డి అన్నారు. టీడీపీ హయాంలోనే దొంగ పట్టాలు సృష్టించారని, దీనిపై వారే ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీపైనా, ఎమ్మెల్యేపైనా అసత్య ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి బాలపోతన్న, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గొరిదిండ్ల కేశవరెడ్డి, నాగరాజు, ముత్యాలరెడ్డి, పోతన్న, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.